# న్యాయమూర్తులకిన్ని సదుపాయాలు న్యాయనిర్ణయానికి శ్రేయస్కరమా?

హైకోర్టు జడ్జీలకు ఇప్పుడున్న ఖరీదయిన కార్ల స్థానంలో 8 లక్షలు ఖరీదు చేసే ఓపెల్ ఆస్ట్రా కార్లు కొనివ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్టు వార్త.

ఇప్పుడు వాళ్ళేం డొక్కు కార్లలో తిరగడం లేదు. ప్రీమియర్ 118 కార్లున్నాయి. వాటి తల మీద ఎర్ర లైట్లు కూడ ఉన్నాయి. వారి మార్గానికి ఎవ్వరూ అడ్డం రాకుండా ట్రాఫిక్ పోలీసులు ఈల వేస్తూ గొడవ చేస్తూ రోడ్డును ఎప్పటికప్పుడు ఖాళీ చేస్తుంటారు.

అయినప్పటికీ అతి ఖరీదైన కొత్త కార్లు కొనివ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

మనుషులను భౌతికంగా సంతృప్తి పరిస్తే మానసికంగా తనకు అనుకూలంగా మారుతారనేది చంద్రబాబు దృఢవిశ్వాసం. పత్రికారంగంతో సహా అన్ని వ్యవస్థల మీదా ఈ నమ్మకాన్ని విజయవంతంగా ప్రయోగిస్తున్నాడు.

అతని విలువలు అవి కాబట్టి అతన్ని కొత్తగా తప్పు పట్టేదేమీ లేదు. కాని తీసుకునేవాళ్ళు ఈ విషయం ఎరిగి తీసుకుంటున్నారా? 'మేము చాలా ఉన్నతులం. ఇటువంటి ప్రలోభాలకు లొంగం. అందువల్ల నిర్భయంగా తీసుకుంటాం' అని ఎవరికి వారు అనుకోవచ్చు. ఈ విశ్వాసం వల్ల ఇటు వస్తులాభమూ ఉంటుంది, అటు ఆత్మగౌరవమూ బలపడుతుంది.

ఇక్కడ సమస్య ఈ విశ్వాసం ఎంత వాస్తవికం అనేది కాదు. కొందరి విషయంలో ఇది వాస్తవికమైనదే కావచ్చు. కొందరి విషయంలో కాకపోవచ్చు. ప్రస్తుత వాతావరణంలో ఏ రంగంలోనైనా ఈ విశ్వాసం వాస్తవికం కాని వాళ్ళ సంఖ్యే ఎక్కువ వుండే అవకాశం ఉంది - న్యాయమూర్తులతో సహా.

కాని ఈ దానగ్రహీతల వ్యక్తిత్వాలతో నిమిత్తం లేకుండా ఇది సూత్రప్రాయంగానే తప్పు. 'న్యాయం జరిగితే చాలదు. అది జరిగిన విషయం కనిపించాలి' అనేది అందరూ ఎరిగిన ఒక న్యాయ సిద్ధాంత సూత్రం. 'న్యాయ నిర్ణయం చేసేవాళ్ళు నిష్పాక్షికంగా వ్యవహరిస్తారన్న విశ్వాసం చాలా అవసరం. న్యాయనిర్ణయ ప్రక్రియ అందుకు తగినట్టుగా ఉండాలి' అని సుప్రీంకోర్టు చాలా తీర్పులలో అనింది. న్యాయమూర్తులు అవసరమైన దాన్ని మించి ప్రభుత్వం నుండి వసతులు పొందడం ఆ విశ్వాసాన్ని పోగొట్టదా? వాళ్ళకు కార్లు అవసరమే. కాని అంబాసిడర్ చాలదా? 8 లక్షల ఖరీదు చేసే కారు కావాలా?

న్యాయమూర్తులకు కనీస సదుపాయాలు గల ఇళ్ళు అవసరమే. కాని మినిస్టర్ల సరసన బంజారాహిల్స్ లోనూ, కుందన్ బాగ్ లోనూ పెద్ద పెద్ద బంగళాలు తీసుకోవడం సబబా?

మినిస్టర్లకయినా ప్రజలతో సంబంధం ఉండే అవకాశం లేని విలాసవంతమైన ప్రాంతాలలో ఆడంబరంగా కట్టిన బంగళాలు కేటాయించడం ఎంత సబబన్న ప్రశ్న వేసుకోవచ్చు. వాళ్ళ సంగతి అటుంచి అనేక రకాల సామాజిక సమస్యలపై తీర్పులు చెప్పే న్యాయమూర్తులకు ప్రజాజీవితంతో కొంతైనా సంబంధం ఉండడం అవసరం. ఇప్పుడు హైకోర్టు న్యాయమూర్తులకు రాష్ట్రప్రభుత్వం కల్పిస్తున్న జీవనశైలి ఎట్లాంటిదంటే, పేదల జీవితం పక్కన పెట్టండి - వారికి మధ్యతరగతి జీవితంతో సహితం సంబంధం లేదు.

అక్కరలేని పోలీసు సెక్యూరిటీ ఈ జీవనశైలిలో భాగం. మన రాష్ట్రంలోని సాయుధ పోరాట సంస్థలేవీ న్యాయమూర్తులను బెదిరించలేదు, చంపుతామనలేదు. వేరే ఎవ్వరి నుండీ వారికి ప్రమాదం లేదు. అయినప్పటికీ జడ్జీలందరికీ పోలీసు ఎస్కార్ట్ ఉంది. పోనీ వారేమైనా వెంట వుండి జడ్జీలను కక్షబూనిన కక్షిదారుల నుండి కాపాడతారా అంటే అదేమీ లేదు. వాళ్ళు జడ్జీల ఇళ్ళ దగ్గరే ఉంటారు. చేయడానికి ఏ పనీ లేని ఈ ఎస్కార్ట్ పోలీసులు ఆ పరిసరాలలో నివసించే ప్రజలను సతాయించిన ఘటనలున్నాయి. ఒక ఖరీదైన అపార్ట్ మెంట్ బ్లాక్ లో నివసించే ఒక జడ్జిగారి ఎస్కార్ట్ పోలీసులు ఆ అపార్ట్మెంట్స్ వాచ్ మాన్ భార్యను వేధించిన ఉదంతం పత్రికలకెక్కింది కూడ.

జైలులోని ఖైదీలను విచారణ నిమిత్తం ఎప్పటికప్పుడు కోర్టుకు తీసుకు రావడానికి చాలినంత మంది ఎస్కార్ట్ పోలీసులు లేని సంగతి, అందువల్ల నేరవిచారణలో చాలా జాప్యం జరుగుతున్న సంగతి తెలిసిందే. జైలు బయట ఉన్న వాళ్ళ 'ఎస్కార్ట్' కే ఉన్న సిబ్బంది అంతా సరిపోతుంటే జైలు లోపల ఉన్నవాళ్ళకు ఎస్కార్ట్ ఎక్కడ నుండి ఇస్తారు? ఈ ప్రశ్న వేరే ఎవ్వరికీ తోచకున్నా న్యాయమూర్తులకు తోచాలి. వాళ్ళయినా 'మాకెందుకీ ఎస్కార్ట్? ఖైదీలకు కల్పించండి' అని తిప్పి పంపించాలి. కాని ఆ ఆలోచన హైకోర్టు న్యాయమూర్తులెవరికీ వచ్చినట్టు లేదు.

విలువల పతనాన్ని గురించి అందరూ మాట్లాడుతుంటారు. జడ్జీలు కోర్టు లోపల, బయట కూడ మాట్లాడుతుంటారు. ఈ మాటలలో నిజాయితీ అసలే లేదని అనడం నా ఉద్దేశం కాదు గాని ఎవరికి వారు తమ జీవనశైలితోనూ, తమ నడవడికతోనూ, తమకు ప్రభుత్వంతో గానీ, విభిన్న సామాజిక వర్గాలతో గానీ ఉన్న సంబంధాలతోనూ నిమిత్తం లేకుండా తమ మానసిక ఔన్నత్యం వల్లనే విలువలు నిలుపుకుంటున్నామనుకుంటే అది అనుమానించవలసిన విషయమే. మానసిక సంకల్పమనేది మనుషులలో ఉండదనీ, భౌతిక జీవితమే అన్నిటినీ నిర్ణయిస్తుందనీ నేను సూత్రీకరించడం లేదు గానీ జీవిత అనుభవం(?). జీవనశైలి ఒక దిశలోనూ, విలువలు

ఇంకొక దశలోనూ ఉండాలంటే చాలా ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉండాలి. అసాధారణమైన ఆత్మావలోకనం కావాలి. అది అందరిలోనూ ఉందని నమ్మలేం.

గ్లోబలైజేషన్ మార్గంలో వేగంగా ప్రయాణించాలని ప్రయత్నిస్తున్న మన ప్రభుత్వం అన్ని విషయాలలో ఈ విధాన మార్పు 'అనివార్యం' అనీ, అది ఇప్పుడు వీస్తున గాలి అనీ, అదే విజ్ఞత అనీ అందరినీ నమ్మించాలని గట్టిప్రయత్నం చేస్తున్నది. సమాజంలో నిర్ణయాత్మక పాత్ర నిర్వహించే అన్ని వర్గాలనూ అందుకు సమ్మతించే మానసిక స్థితిలోకి తీసుకుని రావాలని ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వ చర్యలపైన పర్యవేక్షక అధికారం ఏదో ఒక మేరకు ఉన్న న్యాయమూర్తులు ఈ ఆలోచనా ధోరణికి అనుకూలంగా మారడం ప్రభుత్వానికి అవసరం. వారిని ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు ప్రభుత్వం సహజంగానే చేస్తుంది. న్యాయ నిర్ణయం నిర్భీతిగా నిస్సంకోచంగా చేయాలని తమను తాము తరచూ హెచ్చరించుకునే న్యాయమూర్తులు ఈ విషయం గమనిస్తున్నారా?

నీహార్ ఆన్లైన్.కాం
డిసెంబర్ 2000